క్లుప్తంగా

గిరిజనేతర రైతుల వినతి

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన వినోభానగర్ గ్రామానికి చెందిన గిరిజనేతర రైతులు సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనులకు గిరిజనేతర రైతులకు ఒకే విధంగా ఎకరానికి రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సీతారామ లింక్ కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులందరికీ ఒకే విధంగా నష్టపరిహారం అందిస్తామని చెప్పారని, పట్టాలేని కారణంగా తమకు రూ.5 లక్షలు నష్టపరిహారం ఇస్తామని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. కాగా, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని భూనిర్వాసిత రైతులు తెలిపారు. కార్యక్రమంలో వినోభానగర్‌కు చెందిన గిరిజనేతర రైతులు సిరికొండ నర్సింహారావు, సిరికొండ నాగయ్య, సిరికొండ పుష్పరాజ్యం, రేగళ్ల నర్సయ్య, కుంచాల శివ, సిరిపురపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి వర్తింపజేయాలి


వినతిపత్రం అందిస్తున్న బంజరాకాలనీవాసులు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని బంజరా కాలనీ పేదలకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని స్థానికులు సోమవారం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 13 ఏళ్ల నుంచి 200 కుటుంబాలు ఉన్నాయని, 8 నెలల కిందట కొత్తమీటర్లు ఇచ్చారని, ఉచిత కరెంట్‌కు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు ఎ.సరోజ, చంద్రకళ, రాజేశ్వరి, కనకతార, కుమారి, పద్మ, ఉమా పార్వతి, బేబి, స్రవంతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా దేవీలాల్


దేవీలాల్‌నాయక్

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురంతండాకు చెందిన గుగులోత్ దేవీలాల్‌నాయక్ కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవి సోమవారం నియమాకపత్రాన్ని దేవీలాల్‌కు అందించారు. పార్టీ బలోపేతానికి పాటుపడతానని దేవీలాల్ చెప్పారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్.సుధాకర్‌రెడ్డి

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల ఓసీ అసోసియేషన్ నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సోమవారం హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓసీ అసోసియేషన్ సమావేశంలో ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, డిస్కం, జెన్‌కో ఉద్యోగుల డైరీ, క్యాలెండర్లను రాష్ట్ర అధ్యక్షులు ఆర్.సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ భానుప్రకాష్, జెన్‌కో సెక్రటరీ సందుపట్ల శ్రీనివాస్‌రెడ్డి, కట్టా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

కొత్తగూడెంఅర్బన్: పేద మైనారిటీ మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషన్లను స్వాహా చేసిన వారిపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

సబ్సిడీపై వరి, పెసర విత్తనాలు

పాల్వంచరూరల్: రబీలో సాగు చేసుకునే వరి, పెసర విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖాధికారి శంకర్ తెలిపారు. వరి-1010 రకం విత్తనాలు 20 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని 25 కేజీల బ్యాగు పూర్తి ధర రూ.995 కాగా సబ్సిడీ రూ.250 పోను రైతులు రూ.745 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్ఎన్ఆర్ సన్నరకం వడ్ల విత్తనాలు 20 బ్యాగులు ఉందుబాటులో ఉన్నాయి. 15 కేజీల బ్యాగు పూర్తి ధర రూ.799 కాగా సబ్సిడీ 400 పోను రూ.399 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. పెసర విత్తనాలు మూడు క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. అందులో సబ్సిడీ మినహా 4 కేజీల బ్యాగు రూ.600 ధర చొప్పున ఇస్తారని ఏఓ తెలిపారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకాలను తీసుకువాని రావాలని ఏఓ కోరారు.

అనుభవాలకు అక్షర రూపం

- డైరీలకు తగ్గని ఆదరణ
- దైనందిన జీవితంలో ఒక భాగం
- కొత్త రూపాల్లో మార్కెట్‌లో లభ్యం


మార్కెట్‌లో లభిస్తున్న వివిధ రకాల డైరీలు

సుజాతనగర్: అనుభవాలను అక్షరాలుగా మార్చి పుటలుగా పేర్చితే ‘డైరీ’ అవుతుంది. మనసు స్పందించే ప్రతిభావాన్ని, ప్రతి ఘటననూ, ప్రతి ఆలోచననూ తనలో నిక్షిప్తం చేసుకునే అపురూప పుస్తకమే డైరీ. అందుకే ఇంటర్నెట్, యాండ్రాయిడ్ మొబైళ్లు అందుబాటులోకి వచ్చినా డైరీ ప్రాధాన్యత తగ్గలేదు. తీపి, చేదు సమ్మిళిత అనుభవాలతో ఎప్పటిలానే మరో సంవత్సరం ముగిసిపోయింది. 2025లో కొంగొత్త జ్ఞాపకాలను దాచుకోవడానికి వివిధ కళాకృతులతో మార్కెట్లో డైరీలు సిద్ధంగా ఉన్నాయి.

సరికొత్త రూపాల్లో..

సరికొత్త రూపాల్లో డైరీలు స్వాగతం పలుకుతున్నాయి. దుకాణాల్లో డిసెంబర్ నెలాఖరు నుంచే డైరీల కొనుగోళ్లు మొదలయ్యాయి. ప్రధాన పట్టణాల్లోని పుస్తక విక్రయ దుకాణాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లోనూ డైరీలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.500 విలువ చేసే డైరీలు లభ్యమవుతున్నాయి. వీటిని హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తుంటారు.

మనస్సాక్షికి ప్రతీక

డైరీ మనస్సాక్షికి ప్రతీక. డైరీ రాయడమంటే మనలను మనం సరిచేసుకోవడమే. టెక్నాలజీ పేరుతో రోజుకో సరికొత్త యాప్‌లు, ఫేస్‌బుక్, వాట్సాప్ అందుబాటులో ఉండటంతో ప్రజల్లో కొంతమేర డైరీ రాసే అలవాటు తగ్గుతోంది. డైరీ రాయడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని విద్యావేత్తలు, మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. నిత్యజీవితంలో రోజూ జరిగే కార్యకలాపాలు, గత అనుభవాలు, గడిచిన విషయాలు గుర్తు చేసుకోవడం, ముఖ్యమైన తేదీలు, ఆర్థిక లావాదేవీలు తదితర వాటికి డైరీ ఎంతో ఉపయోగపడుతుంది. డైరీలో రాసిన అంశాలను అప్పుడప్పుడూ సమీక్షించుకుంటే మనం చేసిన తప్పుఒప్పులను సరిదిద్దుకోవచ్చు.

వ్యక్తిగత డైరీలు

ఒక వ్యక్తికి సంబంధించిన డైరీపై పూర్తి హక్కులు అతడికే ఉంటాయి. నిత్యజీవితంలో జరిగిన ఘటనలన్నీ రాత్రి వేళ నిదురపోయే ముందు అందులో నిక్షిప్తం చేస్తుంటారు. ముఖ్యమైన విషయాలు, తీపి జ్ఞాపకాలను అందులో పొందుపరుచుకోవచ్చు.

ప్రొఫెషనల్ డైరీలు

వృత్తిపరంగా బాధ్యతలు అధికంగా ఉండేవారు క్రమం తప్పకుండా ఉపయోగించేవాటిని ప్రొఫెషనల్ డైరీలు అంటారు. పోటీ ప్రపంచంలో ప్రొఫెషనల్ డైరీ ఒక పర్సనల్ అసిస్టెంట్‌గా సహకరిస్తుంది. దైనందిన వ్యవహారాలను మర్చిపోకుండా, సమయానుకూలంగా చేయాల్సిన పనులను గుర్తు చేస్తుంది. ప్రముఖ తేదీలు, ప్రయాణాలను పొందుపరచుకోవచ్చు.

అనుభవాలు నెమరువేసుకోవచ్చు



డైరీ రాయడం ఎప్పటినుంచో అలవాటు. గత అనుభవాలు నెమరవేసుకోవడానికి డైరీ ఎంతగానో ఉపకరిస్తుంది. మర్చిపోయిన విషయాలను డైరీని చూసి తెలుసుకోవచ్చు. గత జ్ఞాపకాలు మనలో వచ్చే మార్పులు బేరీజు వేసుకోవడానికి డైరీ ఎంతో దోహదం చేస్తుంది.

-ఎం.రమాదేవి, ఎస్‌ఐ, సుజాతనగర్

డైరీ రాయడం మంచి అలవాటు



డైరీ రాయడం మంచి అలవాటు. డైరీ రాయడం అలవాటు ఉంటే మన జీవితంలో జరిగే ప్రతి ఘటనను అందులో నిక్షిప్తం చేయొచ్చు. అవసరమైనప్పుడు తిరిగి చూసుకోవచ్చు. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్లు ఎన్ని ఉన్నా డైరీకి మించిన ప్రత్యామ్నాయం లేదు.

-జి.నర్మద, ఏఓ, సుజాతనగర్

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న వామపక్షపార్టీల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్షాల జాతీయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, గౌని నాగేశ్వరరావు, కంచగట్ల సురేందర్, ముద్దా భిక్షం మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుతానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని, రాజ్యాంగాన్ని మార్చాలనే ఆంతర్యం అమిత్ షా వ్యాఖ్యలతో బహిర్గతమైందని పేర్కొన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై స్పందించాల్సిన ప్రధానమంత్రి తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, ఏజే రమేశ్, భూక్యా శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, ఎస్‌కే ఫహీం, యూసుఫ్, రేపాకుల శ్రీనివాస్, ధర్మరాజు, మంద నరసింహారావు, మల్లికార్జున్‌రావు, భూక్య రమేశ్ పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా టేకులపల్లిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలు వామపక్ష పార్టీల నాయకులు డి.ప్రసాద్, బానోత్ ఉక్లా, ధర్మపురి వీరబ్రహ్మచారి, కల్తి వెంకటేశ్వర్లు, భూక్య హర్ష, గుగులోతు రామచందర్, ఎట్టి నరసింహారావు, భూక్య కీరియా పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ అన్నారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. వీర్ల రమేశ్, చప్పిడి వెంకటేశ్వర్లు, బచ్చలకూర శ్రీనివాస్, పుల్లయ్య, శంకర్, బాలు, వెంకటేశ్వర్లు, జ్యోతిరాం, శ్రీనివాసరావు, తిరుపాలు, అయిలయ్య, ప్రసాద్, మురళీ, భాస్కర్, వెంకటరాజు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తే సహించేదిలేదు..


నినాదాలు చేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, పెరాక్స్ మీద ఇన్‌కం ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్ ఇప్పించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందు జేకేఓసీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ఇన్‌కం ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడకపోవటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీరాజ్ అహ్మద్, ఎస్‌ఏ నబీ, ఎండీ అబ్బాస్, రాందాస్, ఒరుగంటి రాజమొగిలి, సోమకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల వితరణ


ప్లేట్లు పంపిణీ చేస్తున్న సంతు, బాల

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండా జీపీ లక్ష్మీనారాయణతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ సంతు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గడిపెల్లి సుధాకర్, గుగులోత్ వెంకట్రాం మాట్లాడారు. తన కుమారుడు లోకేశ్ జన్మదినం సందర్భంగా తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం బాల సామగ్రి అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

పండ్లు పంపిణీ

జూలూరుపాడు: మండలంలోని భోజ్యాతండా జీపీ వెనకతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ కిషన్‌నాయక్ అరటి పండ్లు, స్వీట్లను మధ్యాహ్న భోజన సమయంలో అందించారు. ఏడుకొండలు, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఫ్రాంక్ వీడియోలు చేయొద్దు..

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో రెండు రోజులుగా ఓ ఫ్రాంక్ వీడియో వైరల్ అవుతుండగా, మందా శ్యాంకుమార్ అనే వ్యక్తి సోమవారం వీడియో సందేశం విడుదల చేశాడు. ఏడాది కిందట తాను, ఈసం లక్ష్మణ్ ఓ చోట ఫ్రాంక్ వీడియో చేయగా, ఇప్పుడు అది నిజమని నమ్మించేలా కొందరు గ్రూపుల్లో పెట్టారని తెలిపాడు. డీఎస్పీ చంద్రభాను స్పందిస్తూ ఫేక్, ఫ్రాంక్ వీడియోలను నిజమైనవిగా నమ్మించే యత్నం చేయడం సరికాదన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూమాలవేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు, మాజీ సర్పంచ్ పాయం స్వాతి మాట్లాడుతూ.. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి వ్యవస్థను గాడిలో పెట్టారని గుర్తుచేశారు. తన మేధోసంపత్తితో అనేక విప్లవాత్మక సంస్కరణలు అమలు చేసి దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో అరెం కిరణ్, రాజయ్య, ఎట్టి హరికృష్ణ, తుర్క విజయ్, రాంచందర్, రవీందర్, విజయకృష్ణ, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రిపోర్టర్లపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొత్తగూడెంటౌన్: జిల్లాలో రిపోర్టర్లమంటూ చలామణి అవుతున్న నకిలీలపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ రోహిత్‌రాజుకు కొత్తగూడెం జర్నలిస్టులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతో పాటు ఇతర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు యూట్యూబ్, పీడీఎఫ్, నాన్ రికగ్నైజ్డ్ పత్రికలు, సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకొని, రిపోర్టర్లంటూ ముసుగు ధరించి వ్యాపారులు, కాంట్రాక్టర్లు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రెస్‌క్లబ్ పేరుతో నకిలీ విలేకరులు వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇకపై నకిలీ రిపోర్టర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, అనుమతి లేని యూట్యూబ్, పీడీఎఫ్, నాన్ రికగ్నైజ్డ్ పత్రికల పేర్లతో సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇమంది ఉదయ్ కుమార్, పండుగ రేశ్వంత్, చావా పాపారావు, దాట్ల రవీందర్, నరసింహారావు, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అవాంతరాల నడుమ సర్వే


సుదిమళ్లలో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే మండలంలో అవాంతరాల నడుమ కొనసాగుతోంది. ప్రభుత్వం సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్న పంచాయతీ కార్యదర్శులు సర్వే ప్రక్రియ ప్రారంభించారు. అయితే సెల్ సిగ్నల్ సరిగ్గాలేని పంచాయతీల్లో ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఆఫ్‌లైన్ పద్ధతిలో సర్వే చేయాలని అందుకు సంబంధించిన యాప్‌ను ఉన్నతాధికారులు సిద్ధం చేశారు. కానీ, అప్పటికే సిగ్నల్ ఉన్న ప్రాంతాల్లో సర్వే చేసిన పంచాయతీ కార్యదర్శులు సిగ్నల్ లేని ప్రాంతాల్లో కొత్తయాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను చేపట్టారు. కానీ, ఒకే పంచాయతీకి సంబంధించిన డేటాను రెండు యాప్‌లలో అప్‌లోడ్ తీసుకోకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో చేసేదిలేక కార్యదర్శులు తిరిగి ఒకే యాప్‌లో మొత్తం సర్వేను ప్రారంభించాల్సి వస్తోంది. ఫలితంగా సర్వే ప్రక్రియ మండలంలో అవాంతరాల నడుమ నిదానంగా సాగుతోంది. సోమవారం సెల్ సిగ్నల్ సరిగ్గా లేని పంచాయతీలను ఎంపీడీఓ ధన్‌సింగ్ సందర్శించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే జూలూరుపాడు మండలవ్యాప్తంగా కొనసాగుతున్నది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో సేకరించిన వివరాలను పంచాయతీ సెక్రటరీలు ఆన్‌లైన్ చేస్తున్నారు. సోమవారం ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 9,402 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయని, వీటిని పరిశీలించి, ఇళ్ల మంజూరు కోసం సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 62 శాతానికి పైగా సర్వే పూర్తి అయినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

సర్వే తేదీని పొడిగించాలి

టేకులపల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వే తేదీని పొడిగించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనేక ఇబ్బందులు వస్తున్నాయని, ఇందులో అనేక మంది పేర్లు మిస్ అయ్యాయని యాప్లో కూడా ఇంటి పేర్లు తప్పుగా ఉన్నాయన్నారు.

శాంతియుతంగా జరుపుకోండి..

కొత్తగూడెంఅర్బన్: నూతన సంవత్సర వేడుకల పేరుతో ఇతరులకు అసౌకర్యం కలిగేలా ప్రవర్తించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు ఉంటాయని కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ హెచ్చరించారు. స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సరం విషాదంతో ఆరంభం కాకుండా అందరూ జాగ్రత్త పడాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా, మద్యం మత్తులో వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత అనవసరంగా రహదారులపైకి వచ్చి బహిరంగ ప్రదేశాల్లో ఇతరులు ఇబ్బంది పడేలా వేడుకలు చేసినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని, డీజే సిస్టమ్‌పై నిషేధం ఉంటుందని సీఐ తెలిపారు.

సంతోషాల నడుమ..

టేకులపల్లి: సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని టేకులపల్లి ఎస్‌ఐ సురేశ్ ప్రజలకు సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలు అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలన్నారు.

సంబరాలను వ్యతిరేకించండి..



మాట్లాడుతున్న ముద్దా భిక్షం

సింగరేణి(కొత్తగూడెం): వ్యాపారీకరణలో భాగంగా జరిగే నూతన సంవత్సర సంబరాలను వ్యతిరేకించండని, ప్రజా ఉద్యమాలను స్వాగతించండని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు, పెట్టుబడిదారులు వారి కంపెనీల్లో ఉత్పత్తి అయిన సరుకులను విక్రయించుకోవడం కోసం ఏటా నూతన సంవత్సరం సంబరాలకు పిలుపునిస్తూ ఉంటారని, భూమి ఎప్పటిలాగే తనచుట్టూ తాను తిరుగుతూనే ఉంటుందని, డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12 గంటల తర్వాత భూమి తిరగటం ఆగిపోవటం లేదన్నారు. అది కేవలం క్యాలెండర్ లెక్క మాత్రమేనని, సంబరాలు చేసుకోవడం అర్థంలేదని పేర్కొన్నారు. సమావేశంలో డివిజన్ నాయకులు ఏదులాపురం గోపాల్‌రావు, బానోత్ ధర్మ, బుర్ర వెంకన్న, పెద్దబోయిన సతీశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతి కోసం పాటుపడాలి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

టేకులపల్లి: ప్రపంచ శాంతి కోసం పాటు పడాలని టేకులపల్లి మండల పాస్టర్స్ ఫెల్లోషిప్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జాన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి టి.బోయాజ్ పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు ప్రభుత్వం అందించే నిధులతో సోమవారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాన్ రామయ్య చర్చిలో విందు ఏర్పాటు చేశారు. తొలుత మండల పాస్టర్లు, సిస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, సిస్టర్లు జి.రాజు, రాంచందర్, పి.అబ్రహం, డి.హానోకు, దేవరాజ్, దావీదు, వాగబోయిన మార్కు, రెడ్డయ్య, కమలాకర్, దానియేలు, సుమంత్, పాల్ సిమోన్, పేతురు, మార్క్, తిమోతి, మోషె, ప్రేమరాజ్, జాన్ ఫిట్టర్, స్టీవెన్, శ్యాంబాబు, రాజ్ మార్, స్వతంత్ర, మేరీ సోనీ, సారా కుమారి, లుదియా తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందించండి..


మాట్లాడుతున్న మునిగడప పద్మ

సింగరేణి(కొత్తగూడెం): గత ప్రభుత్వం సగంలో వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించాలని పదో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ కోరారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక అయోమయంగా ఉందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాన్ని సరిచేసి, ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె కోరారు. సమావేశంలో డి.హేమలత, డి.నాగమణి, గడిదాస్ కుమార్, స్వామి, వేల్పుల స్వరూప, నజియా, ఆసియా, నజీం, భరత్, ఎల్లమెల్లి సత్యనారాయణ, భవాని పాల్గొన్నారు.

నల్లగొండకు తరలిన సీపీఐ శ్రేణులు


తరలివెళ్తున్న సీపీఐ నాయకులు

జూలూరుపాడు: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నల్లగొండలో జరిగిన బహిరంగసభకు జూలూరుపాడు మండలానికి చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్‌పాషా, గార్లపాటి శివకృష్ణ, పాలెపు ప్రభాకర్, చెరుకుమల్ల రామకృష్ణ, సిరిపురపు వెంకటేశ్వర్లు, బడుగు వీరస్వామి తదితరులు ఉన్నారు.

నియామక ప్రక్రియ చేపట్టండి..

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్, కెమిస్ట్‌ల నియామకాలు వెంటనే చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), 60 కెమిస్ట్ ఉద్యోగాల కోసం 2023 అక్టోబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి, మూడు సార్లు జాప్యం అనంతరం గత జూలై 14న రాత పరీక్ష నిర్వహించి, గత సెప్టెంబర్ 4వ తేదీన ఫలితాలు ప్రకటించారని, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం నియామక ప్రక్రియ ఆగిపోయిందని పేర్కొన్నారు.